


"ఇవ్వాళ మా యింట్లో కాఫీ తాగి వెళ్లాలి మీరు..."

రేణుక వసుంధరాదేవి వైపు తిరిగి అన్నది. ఒక్కక్షణం ఆమె పెదాలపై చిరునవ్వు చిందింది. కళ్లు కాంతి వంత మయినాయి. ఆమె ముఖం మరింత నిండుగా ఆకర్షణీయంగా కన్పించింది వసుంధరాదేవికి.

"అలాగే..కాఫీ తాగడానికి అభ్యంతరం లేదు. కాని, తొందరగా వెళ్లాలింటికి.... చెయ్యాల్సిన పని చాలావుంది.

రేణుక తాళం తీసి ఇంట్లోకి అడుగు పెట్టింది. వసుంధరాదేవి ఆమెను అనుస రించింది.

సోఫా చూపిస్తూ

"కూర్చోండి ఇప్పుడే వచ్చేస్తా...." అన్నది రేణుక లోపలి గదిలోకి వెడుతూ.

"థాంక్స్ ." అన్నది వసుంధరాదేవి.

అది సాయంత్రపు వేళ. సమయం సుమారుగా ఆరు గంటలు. ఎండలేదు కాని వెలుగు మాత్రం తగ్గలేదు.

హాల్లో సోఫాలో కూర్చుని గది నలు మూలలా నిశితంగా చూడ సాగింది వసుం ధరాదేవి. గది మధ్యలో 'సోఫాసెట్టు' ..ఒక మూల బల్ల .. దాని మీద రేడియో ... దానికొక ప్రక్క ఫోటో ఫ్రేము... దాన్లో నవ వధూవరుల ఫోటో వధువు రేణుక. అక్కడి నుండి వసుంధరాదేవి దృష్టి ఎదురు గోడ మీదకు పోయి ఒకచోట నిలిచిపోయింది. అక్కడొక క్యాలెండరు వ్రేళ్లాడుతున్నది.. దాని మీద బొమ్మ యువదంపతులు... భర్త ప్రక్క భార్య. తల్లి చేతుల్లో పసి వాడు...తండ్రి వైపు కొంటెగా చూస్తూ, కేరింతలు కొడుతూ బోసినవ్వులు చింది స్తున్న పసివాడు. ఆ బొమ్మ వాస్తవానికి చాలాదూరంలో ఉన్నట్లు అన్పించింది, వసుంధరాదేవికి! ఆవిడకు అగది అంతగా నచ్చలేదు! తలుపు దగ్గరగా వేసి లోపలి గదిలోకి వచ్చి నిలబడింది రేణుక కాఫీ తయ్యారు చెయ్యడంలో నిమగ్నురాల య్యింది.

వసుంధరాదేవి రేణుక వైపు చూస్తూనే ఉంది. రేణుక ముఖంలో లక్ష్మీకళ ఉంది నవ్వినప్పుడు మరింత అందంగా, హుందాగా, అమాయకంగా కన్పిస్తుంది. పతి

పూర్ణమైన యవ్వనం అవయవాల్లో తొంగి చూస్తున్నది. సన్నని పొడవైన విగ్రహం. పసిడి ఛాయ...మీనాల్లాంటి కళ్ళు..పొడవైన సన్నని నాసిక ..విండ్లను బోలిన కనుబొమలు...అర్ధచంద్రాకృతిలో నున్న నుదుటిపై గాలికి అల్లల్లాడే ముంగురులు.. వాటి వెనుక కొంచెంగా కన్పిస్తున్న కుంకుమ ఆమె కదలికల్లో, కళ్లల్లో చిందులు త్రొక్కే పసితనం చూస్తే ఆమెకు ఇరవైనాలుగేళ్ల వయస్సుండదేమో నన్పిస్తుంది! విల్లవేళలా ముఖంలో తొంగి చూసే చిరునవ్వు, కదలికల్లో, మాటల్లో ఉత్సాహం చూస్తే దుఃఖానికి అతీతురాలుగా కన్పిస్తుంది ,చిరునవ్వునీ, ఉత్సాహాన్ని, సంతోషాన్ని మింగి వేసే క్లిష్ట సమస్యలు, బరువు బాధ్యతలు ఆమెకు బహుశా వుండి ఉండక పోవచ్చు! పరిస్థితులు, జీవితం ఆమెకు అనుకూలంగా వుండి ఉండచ్చు! 'రేణుక భర్త అనుకూలుడయి వుంటాడు' అనుకున్నది వసుంధరాదేవి.

రేణుక లేచి అలమారు లోంచి రెండు కప్పులూ, రెండు సాసర్లూ తీసి బల్ల మీద పెట్టింది. వసుంధరాదేవి పరీక్షగా ఆ కప్పుల వైపు, ఆ సాసర్ల వైపు తరచితరచి చూడ సాగింది. పువ్వుల గుత్తుల డిజైను... ఆకుపచ్చని రేకులు తెల్లని హృదయాలు.. నల్లని అంచులు ఆకుపచ్చని రంగు తెలుపు. నలుపు..ఆకుపచ్చ ...

డైనింగు బల్ల చుట్టూ సంతోషం పొంగిపొర్లే గొంతుకలు...ఆకుపచ్చని రంగు... తెలుపు రంగు...నలుపురంగు... డైనింగు టేబిల్ కుర్చీలు...గాజు సామాను వున్న అలమారు కాఫీ తయారు చేస్తున్న మాతృమూర్తి. ఇంకా ఇంకా ఒకదాని తర్వాత ఒకటి మెదిలి ఒకదాన్లో ఒకటి ఐక్యమై.. ఒక్క దృశ్యమైంది...మూడు రంగులు... ఆకుపచ్చ ..తెలుపు నలుపు...

కొంతమందికి నిముషాలూ, క్షణాలూ కాలానికి కొలబద్దలు.... ఇంకొందరికి మాసాలూ, సంవత్సరాలూ. మరికొందరికి గత జీవితంలో హృదయానికి హత్తుకున్న సంఘటనల స్మృతులు....

మనస్సు గతమనే గమ్యస్థానానికి పరుగులు తీస్తున్నది. హృదయం వర్తమాన, భూతకాల మధ్య వూగిసలాడి వూగిసలాడి, వాస్తవానికి కొంచెం దూరంలో ఉన్నదానిపై మ్రొగ్గుతున్నది. ఈ క్షణాన వాస్తవానికి, జరిగిన దానికీ మధ్య అంతులేని దూరమున్నదేమో నన్పిస్తున్నది. కాని ఆక్షణాన అది వాస్తవానికి ఎంత దగ్గరగా గోచరించింది?..ఆ కప్పులూ, సాసర్లూ అతివేగంతో 'జెట్' విమానం కన్న వేగంతో మనస్సును గతానికి తీసుకుపోతున్నవి.

ముఖాలూ..!రంగులూ... కోణాలూ .. గోడల చివరలు ..సందడిగా వుండే డైనింగ్ రూము...మెరిసే 'మెరూన్'రంగు సిమెంటు గచ్చు ...... దాని మీద ..... గది, మధ్యలో అన్నివేళల్లోను దర్శనమిచ్చే, ఎన్నటికీ చెరగని, మాయని తెల్లని మచ్చ....

ఇప్పుడు ఆగదిలో ఎవరు వుంటున్నారో? ఆగది గోడ మీద ఆకాలంలో బోసినవ్వులు చిందులు త్రొక్కే పసివాడి స్థానాన్ని ప్రస్తుతం అర్ధ నగ్నంగా వున్న సినిమా తార బొమ్మ ఆక్రమించి ఉండచ్చు! తన స్థానాన్ని మరెవరో భర్తీ చేసే ఉంటారు. ఆస్థానం ఖాళీగా ఉండదు! అయితే ఆస్థానాన్ని ఆక్రమించిన వ్యక్తి ఎటువంటిదో... రాత్రనక పగలనక గ్రామఫోను వేస్తూ ఇరుగుపొరుగుకి సమస్యను తెచ్చిపెడుతూ ఉండచ్చు...లేదా.. వాళ్లతో కయ్యానికి కాలు దువ్వుతూ ఉండొచ్చు ... ఇరుగుపొరుగుకి మధ్య ఉండాల్సిన మిత్రత్వానికి అంతరాయం కల్గిస్తూ ఉండచ్చు......

వచ్చే స్నేహితులు?...కొంతమంది తెల్లవారిందని సూచిస్తూ తొలికోడి కూయకుండానే, ఇంకా చీకట్లు కరగకుండానే దర్శనమిచ్చేవారు. తను తప్పని సరిగా లేచి తలుపు తీసి స్వాగత వచనాలు పలికేది. ఇంట్లో అడుగు పెట్టకుండానే వాళ్ల నోటంట ఆత్రతతో వచ్చే మాటలు ..'శేఖరం ఉన్నాడా?'... అతను ఇంట్లో లేకపోతే వాళ్ల ముఖాల్లో తొంగి చూసేది నిరుత్సాహం.. తలకాయలు వాల్చేసి, ఏదో కోల్పోయినట్లు భారంగా అడుగులు వేసుమేంటూ వెళ్లేవారు. ఒక్కొక సారి వాళ్లు వచ్చేసరికి అతను నిద్రలోనే ఉండేవాడు...సగం నిద్రకళ్లతోనే ప్రక్కకు తిరిగి స్వాగతం చెప్పేవాడు...ఆ దృశ్యంతో తెల్లవారేది...స్నేహితుడి తర్వాత స్నేహితుడు. వేళ ప్రకారం సూర్యుడు అస్తమించేవాడు. కాని అతనికి రోజుకొక వేళకి దినం పూర్తయ్యేది...అతనెప్పుడూ స్నేహితుల వల్ల అలసి పోలేదు. పైగా వాళ్లను చూస్తూనే ఉత్సాహాన్ని, ఓపికను మరింత పుంజుకునే వాడు. ఇల్లొక 'వెయిటింగ్' రూము.. స్నేహితులు కలసే స్థలం. స్నేహితుల మీద చూపించిన శ్రద్ధ ఇంటి విషయాల మీద చూపిస్తే ఎంత బాగుండేది! .ఉదాహరణకి అతని నోటంట వచ్చేమాటలు కించత్తయినా చలించని స్వరంతో వెలువడే మాటలు. .'వసూ నీ మందు తేవడం మర్చిపోయాను. అసలు తెద్దామనే అనుకున్నాను. సుమీ.. ఎంతమంది స్నేహితు లనుకున్నావ్. ఎన్నిమాట లనుకున్నావ్. ఆ ధ్యాసలో పడి మర్చిపోయాను. తెల్లవారనీ పట్టుకొస్తాను సుమా...', 'బాబుకి హార్లిక్సు అయిపోయిందని చెప్పావు కదూ..మర్చేపోయాను సుమీ ... ఈపూటకి ఆవుపాలల్లో నీళ్లు కలిపి పట్టెయ్యి..పొద్దున్న చూసుకుందాం ' అవి పొరపాటు జరిగినందుకు అభ్యర్థనలా? లేక పొరపాటు జరిగినందుకు చెప్పుకునే సంజాయిషీలా?...ఇవి తరచుగా జరిగే సంఘటనలు. ఒకటి రెండుసార్లయితే పొరపాటనుకుని సమాధానపడచ్చు .. ఎప్పుడూ జరిగే సంఘటనలు పొరపాట్లు ఎలా అవుతాయి?.

తన బాబు..పద్దెనిమిదేళ్ల క్రితం ఏణ్ణర్థం పసివాడు. అందరికీ ఒక రబ్బరు బొమ్మ. అందరికీ ఒక వేడుక. అందరికీ అన్నివేళలా కాలక్షేపాన్ని ఇచ్చే మనిషి . క్షణాలూ, నిముషాలూ, గంటలూ మర్చిపోయేంతగా ఆనందాన్ని సంతోషాన్ని ఇవ్వగలిగే మనిషి..వాడి చేతుల్లోనూ, చూపుల్లోనూ తొంగి చూసేది కొంటెతనం .. నున్నని గచ్చుమీద చేతికందని వేగంతో తప్పటడుగులు .... వాడి వేగం చూస్తూంటే పడతాడేమోనని భయంవేసేది 'తనకు..... వాడా పడేది ? తనను ఇంట్లో ప్రదక్షిణలు చేయించి, తనకు ఆయాసం వచ్చి చతికిల బడ్డాక వీరుడిలా తప్పటడుగులు వేసు'

# అడ్డుగోడ

కొంటూ నవ్వే [illegible] దాచు కునేవాడు. అంతో తన పిట్టను కుమ్మే వాడు. అప్పుడు తనకు నొప్పి పుట్టేది కాదు. అదొక దివ్యానుభూతిగా అన్పించేది.... చిన్ని చేతులు బొమ్మల్ని తడి మేవి. వస్తువులపై హఠాత్తుగా పడే చిన్ని చేతులు.... గాజు సామానంటే మరింత ఆతృతతో పడే కోమలమైన చేతులు... ఆకుపచ్చని పువ్వులు వాడి దృష్టిని ఆక ర్షించేవి. చూడ్డమే తరువాయి. చేతులు వాటిమీద పడ్డం ఒకదాని తర్వాత ఒకటి అఖరు చెయ్యడం.... అన్నీ ముక్కలైతేనే గాని వాడి ఆట పూర్తయ్యేది కాదు.... ఒక్క క్షణం కప్పులూ, సాసర్లూ విరిగి పోయినందుకు విచారం కలిగేది. వాటినీ చూసి సాధించిన విజయాన్ని తెలియపర్చ డాని కన్నట్లు చప్పట్లు చరిచేవాడు. బోసి నవ్వులు నవ్వేవాడు ... వాడి నవ్వు ధూళికి, విరిగిన వాటి ధ్యాస మాయ మయ్యేది. అసలు తక్కిన వాళ్లను తన వైపు త్రిప్పుకొనగల చాతుర్యం వాడి కుందేమో ?... ఆ అమాయకపు నవ్వు ... ఆ పసివాడి నవ్వు వెనుక నల్లని గంభీర మైన మబ్బులు . ఏ క్షణాన్నయినా వర్షించ సామర్థ్యంగల మబ్బులు . . కన్పించీ కన్పిం చని ఉదాసీనత .... ఇంటి విషయాలవట్ల అసంతృప్తి.... ఒక విధంగా మన్నిత విష యాల్లో అసంతృప్తి ఇవన్నీ కలసి రూపొందించేది. ఇద్దరి వ్యక్తుల హృద యాల మధ్య ఎన్నటికీ తరగని దూరం...' నల్లని మబ్బులు.... ఎర్రని కవళికలు.... వడగాడ్పుల్లాంటి ఉద్వేగాలు .... చివరకు మిగిలినది ?

"కాఫీలో పంచదార సరిపోయిందా ?...."


ఉలిక్కిపడింది వసుంధరాదేవి. ఆమె మనస్సు గతంలోంచి వర్తమానంలోకి రావ డానికి కొద్ది క్షణాలు పట్టింది. కప్పు అందుకుని కాఫీ ఒక గుటకవేసి కప్పు తిరిగి బల్లమీద పెట్టింది. నలుమూలలా వింతగా చూడసాగింది. రెండు గదులు.. రెండు వాతావరణాలు. .. ఒకదాన్లో ఒకటి ఏది వర్తమానమో, ఏది భౌతికమో తెలియ నంతగా కలసిపోయాయి.

ఇంతకూ జరిగిన దేమిటి ?... తా మిద్దరూ దెబ్బలాడుకున్నారా ? ఘర్షణ పడ్డారా ? ... లేదు .... మరి ఇద్దరికీ మధ్య ఈ అనంతమైన దూరానికి హేతువు? . పరిస్థితులు ప్రవర్తనలు . ఎన్న టికీ పూర్తికాని ప్రమాణాలు.... ఒక్కా సారిగా గట్టు తెగిన ఏటి ప్రవాహపు వేగంతో కనుగొనబడ్డ హృదయాంతర్గత భావాలు... అవి అతను స్పృశించలేనివి..'. అతను కను గొనలేనివి.... ఎప్పటికప్పుడు మార్గంలో ఎర్రటి దీపాలు దర్శనమిస్తూనే ఉండేవి... కొన్ని సంఘటనలు.... కొన్ని సందర్భాలు తామిద్దరి హృదయాలను వేరుచేసి క్షణ క్షణానికి మధ్య దూరాన్ని హెచ్చు చేసి నాయి.... అవే తమ మధ్య నిలచిన అడ్డు గోడకు పునాదిరాళ్లు..... ఆ గోడ ఎత్తు రామరాము పెరిగింది.... ఒకరి నొకరు చూసుకోనేలేనంత ఎత్తుగా పెరిగిపోయింది!

ఒక్క క్షణం వసుంధరాదేవి ఆలోచ నల్లో పడింది..... అసలు గోడెక్కడ ? తమ మధ్యా ?.... తమ హృదయాల్లోనా ?.... తమ మధ్య అయిన వక్షంలో ఆ అడ్డు గోడను కూల్చడానికి మార్గాలు ఉండే వేమో ? .... అది హృదయాల్లో గోడ ! శాశ్వతంగా చెక్కు చెదరక నిలచిపోయేంత దృఢంగా ఉన్న గోడ అది !! అది కట్ట బడ్డది నల్ల కంకరతోనూ, సిమెంటుతోనూ ఏమో ? .... అయితే నేం? .... అతనికి లెక్కలేనంతమంది స్నేహితులు .... అతని శ్రేయస్సును కోరేవాళ్ళు .... వాత్సల్యంతో చూసుకునేవాళ్లు .... ప్రేమించేవాళ్లు .... అతని స్నేహం కోసం ప్రాకులాడే మను ష్యులు వాళ్లు .... వాళ్లను అతి దగ్గరగా తెచ్చుకోగల నేర్పు అతనికి ఉంది. నెలల తరబడి వాళ్లను మర్చిపోనూ గలడు. అతని లోకం స్నేహితులనబడే మనుష్యులు.... తప్పు చేసినవాడికి అతనొక మహానుభావుడు ! ఇచ్చిన డబ్బు వసూలు చేసుకోడానికి అప్పుల వాళ్లు నెలల తరబడి ఓపికతో ఎదురు చూసేవారు !

'అతనంత దయాళువు '... 'అతని స్వభావమంత మంచిది' ....'ఈ ఇరవయ్యో శతాబ్దంలో అల్లాంటి వాళ్లను ఎక్కడో కాని చూడం...." ఇవి స్నేహితులు అత నిని గురించి అనే మాటలు.

ఒక్క క్షణం వసుంధరాదేవి మనస్సు ప్రసవ వేదనతో మూల్గుతున్నప్పుడు .... నెప్పులతో మెలికలు తిరుగుతున్నప్పుడు...



జీవన్మరణాల మధ్య ఊగిసలాడు తున్నాడు, అతనిలో కలిగిన చంచలం ... తనకేమీ పట్టనట్లు మంచం దిగనేలేదు.... అతను నవ్వుముఖంతో తన ఎదుట నిలబడితే తన బాధ మాయమయ్యేదేమో ? .... ఆ హృదయంలో తృప్తి, ఆనందమూ చోటు చేసుకునేవేమో ?.... అతనికి మంత్రసాని ఇల్లు తెలియకపోవచ్చు ..... కాని రామం తనకు తెలుసు నన్నప్పుడు ప్రక్కకు తిరిగి కళ్ళు తెరవకుండానే, నిద్రవత్తు తావి 'ఆ సంగతేదో నువ్వు చూడా'ని పాడిక పురమాయించి గోడవైపు తిరిగిపోయాడు... దాంతో తన బాధ్యత తీరినట్లు విశ్రాంతగా నిద్రపోయాడు .... పసివాడి 'కేరుమన్న ఏడ్పు అతనిని నిద్రలోంచి యదార్థం

---


* నా చర్మ సౌందర్యమునకు లక్స్ దివ్యమైనది *

అన్నది వైజయంతిమాల




వైజయంతిమాలకున్నట్లే మీకున్న చర్మసౌందర్యం అమూల్యం... ఆ సాధనమే దానికి తగినది!

సుందరియైన వైజయంతిమాల ఇలా చెప్పుచున్నది. చర్మసౌందర్యం మీకు, నాకు ఉభయులకు అమూల్యం. ఎందుకంటే, అది సతతమూ పరిపూర్ణ సౌందర్యంగా వుంచుతుంది. నా సౌందర్యకారియైన సబ్బు...లక్స్‌ను మీరు ఎందుకు వాడి చూడగూడదు ? దాని మీగడవంటి నురగ ఎంతో సౌమ్యమైనది...నాకు ప్రియమైన పరిమళం గలది. లక్స్‌ను మీ సౌందర్యసాధనగా రోజూ వాడండి.

లక్స్ టాయ్‌లెట్ సబ్బు సినీతారలకు సౌందర్యమునిచ్చే శుద్ధమైన, సౌమ్యమగు సబ్బు తెలుపులోను, నాలుగు వాసవెల్లి రంగుల్లోను వున్నది

హిందుస్థాన్ లీవర్ తయారీ

లింటాస్.LTS 189-140 TL

కి, శాస్త్రవేత్తలకి తిర్చింది.

'జీవితమే అంత' అన్నది జనవాక్యం.... మనిషి పుట్టినప్పుడు గ్రీష్మం .... వివాహమప్పుడు వసంతం.... ఆ తర్వాత ??

మండు వేసవి వడగాడ్పులు కావి, శరీరాన్ని వణికించే 'జివ్వు' మంటూ వీచే శిశిరపు గాలి కావి తన మనస్సును ఏమాత్రమూ మార్చలేకపోయాయి. ఐతే ఈ చిన్న సంఘటనతో తన హృదయఫలకం బీటలు తీసింది.

# అడ్డుగోడ

హృదయంలో నిలబడిన అడ్డుగోడ పునాది పత్యమైనది.... దృఢమైనది..., ఎన్నటికీ చెక్కు చెదరనిది.

మనస్సుకు శాంతి దూరమయ్యింది.... విశ్రాంతి దూరమయ్యింది. ఒక సంఘటనలోంచి ఇంకొక సంఘటనలోకి .... ఒక దృశ్యంలోంచి ఇంకా దృశ్యంలోకి .... ఒక అధ్యాయంలోంచి ఇంకో అధ్యాయంలోకి పరుగెడుతున్నది మనస్సు..... అయితే దేవి మీదా స్థిరంగా నిలవడంలేదు.

ఆ కప్పులూ, సాసర్లూ ఒకదాని తర్వాత ఒకటి ముక్కలయ్యాయి. హృదయం శిలగా మారింది.... అనుబంధం తెగిపోయింది... ఆకుపచ్చని పువ్వులు .... నల్లని అంచులు.... తనకు దక్కినదల్లా ఒక్క కొడుకు. బోసి నవ్వులు చిందించే కొడుకు.... తెల్లగా బొద్దుగా ఉండే కొడుకు. మెడ కొక గుది బండలా తనకొక తెంచుకోలేని బాధ్యత.

జీవితమే తనకొక పాఠం.... అడుగడుగునా సమస్యలు... తను ముఖపడింది లేదు. అతన్ని ముఖపెట్టనూ లేకపోయిందేమో ?

బాబు చదువు కొద్ది నెలల్లో ముగుస్తుంది. వాడి కొక ఉద్యోగం దొరికితే తను ఉద్యోగం చెయ్యవల్సిన అవసరం ఉండదేమో ?!.... కోడలొచ్చాక తనింక విశ్రాంతి తీసుకోవచ్చునేమో ?.....

ఏమో ఏం చెప్పగలం ?.... తన జీవితంలో ఇంతవరకూ కోరుకున్నట్లు సాగింది కనుకనా? ..తనకు భవిష్యత్తొక ఎండమావి. కాని తాను హృదయమున్న మనిషి ! ఆశించడమే తన వంతు.

"ఏమిటలా కప్పు వైపు అల్లా చూస్తారు ?... కాఫీ చల్లారిపోతోంది "

మరొక్కసారి వసుంధరాదేవి 'ఉలిక్కి' పడింది. రేణుక మాటలు ఆమె మనస్సును ఎండమావుల్లాంటి స్మృతుల నుండి యథార్థంలోకి తీసుకువచ్చాయి.

ఒక్కసారి భారమైన నిట్టూర్పు విడిచింది వసుంధరాదేవి చెమటలతో నిండిన చెక్కిళ్లను రుమాలుతో అద్దుకుంది కళ్లు తుడుచుకుంది రేణుకవైపు దృష్టిని సారించింది ఒక్క క్షణం .. ఆమె పెదాలపై పేలవమైన చిరునవ్వు మెదిలింది. శక్తినంతనూ కూడదీసుకుని, శూన్యంలోకి దృష్టిని మరలుస్తూ నిర్జీవమైన స్వరంతో తనలో తాను గొణుక్కుంది "ఒకప్పుడు ... ఒకప్పుడు.... నా దగ్గర ఇల్లాంటి 'కాఫీ సెట్' ఉండేది. దానిమీద .... పువ్వులు... ఆకుపచ్చని రేకులు .... నల్లని..... "


సువాసనలు వెదజల్లే, మీకు సొగసు సమకూర్చే పామొలీవ్ లవెండర్ టాల్క్

మీకు నచ్చే సువాసనలు మీ కోసం తిరిగి సృష్టించ బడ్డాయి ! ప్రపంచ సౌందర్య కేంద్రాలనుంచి, గతంలో సులభంగా దిగుమతి అయ్యే సువాసనల గురించి మీరు ఇక కలలు గంటూ కూర్చో నక్కర్లేదు. ఈ నాడు పామొలీవ్ లవండర్ టాల్కుతో, దానిలో కలసిన సువాసనలతో మిమ్మల్ని ముంచెత్తుకో గలరు, పామొలీవ్ లవండర్‌ను ఒళ్లు అంతా జల్లుకొని సొగసుగా వుండండి.

పామొలీవ్ లవెండర్ టాల్కుతో ఎప్పుడూ తాజాగా పరిమళ లావణ్యంగా వుండండి




క్రొత్త పామొలీవ్ టాల్కం డీలక్స్ 17 మనోహరమైన సువాసనలు కలిగి ఉన్నది